సాక్షి
జోగుళాంబ గద్వాల

మంగళవారం । 7 । నవంబర్ । 2023



'సాక్షి' స్పెల్‌బీకి స్పందన

మహబూబ్‌నగర్ మౌంట్ బాసిల్ హైస్కూల్‌లో నిర్వహించిన 'సాక్షి' స్పెల్‌బీ స్పందన వచ్చింది.

వివరాలు IIలో ▸



సెంటిమెంట్ కొనసాగేనా?

అచ్చంపేటలో గెలిచిన పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం సెంటిమెంట్‌గా మారింది.

వివరాలు IIIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.2 /21.5

రోజంతా సాధారణంగానే ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశాన్ని మేఘాలు దట్టంగా కమ్ముకుంటాయి. రాత్రి చలి పెరుగుతుంది.

పాలమూరును ముంచింది కాంగ్రెస్సే

ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

- రిజర్వాయర్లను పూర్తి చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తితో బీడు భూములు సస్యశ్యామలం
- గద్వాలను గబ్బు పట్టించినోళ్లను తరిమికొట్టండి
- పదేళ్ల అభివృద్ధి మీ కళ్ల ముందు కనబడుతుంది..
- అభ్యర్థి గుణగణాలతో పాటు అతని వెనక ఉన్న పార్టీ చరిత్ర చూడండి
- దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేట ప్రజా ఆశీర్వాద సభలు విజయవంతం

గద్వాల రూరల్/గద్వాల అర్బన్/ గద్వాల/దేవరకద్ర/మక్తల్/ నారాయణపేట: 'పాలుగారిన పాలమూరు జిల్లాను సమైక్య రాష్ట్రంలో ముంచింది కాంగ్రెస్ పార్టే. ఆనాడు ఉన్న ముఖ్యమంత్రులు జిల్లాను దత్తత తీసుకుని.. ప్రాజెక్టులకు పునాదులు వేశారే తప్పా బాగు చేసిందేమీ లేదు.' అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఉమ్మడి పాలమూరులోని దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేట నియోజకవర్గ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు విజయవంతమయ్యాయి. సీఎం కేసీఆర్ ప్రసంగం గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. కాగా.. హెలీకాప్టర్‌లో సాంకేతిక సమస్యతో కేసీఆర్ పాలమూరు కావడంతో.. సాయంత్రం నారాయణపేటలో సభ ముగిసిన తర్వాత ప్రత్యేక బస్సులో రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడం వల్ల పాలమూరు సస్యశ్యామలమైందని, వలస కూలీల జిల్లాకే ఇప్పుడు వలసలు వచ్చేలా మారిందని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చాక కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసినట్లు గుర్తు చేశారు. దేవరకద్ర నియోజకవర్గంలో సైతం పెండింగ్‌లో ఉన్న కోయిల్‌సాగర్ ప్రాజెక్టును ఇక్కడి ఎమ్మెల్యే నిలబడి పూర్తి చేసుకొని నీళ్లు తెచ్చే ప్రయత్నం చేశారన్నారు. పాలమూరు ఎత్తిపోతలలో భాగంగా ఎక్కువ నష్టం జరగకుండా కర్వెన రిజర్వాయర్‌ను కట్టుకున్నామని, దీని ద్వారా 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు రాబోతుందన్నారు. ఇందులో దేవరకద్రకు 60 వేల ఎకరాలకు సాగునీరు లభిస్తుందన్నారు. ఇక్కడి ఎమ్మెల్యేకు చెక్‌డ్యాంల వెంకటేశ్వర్‌రెడ్డిగా పేరు పెట్టాలని, పట్టుబట్టి 30 చెక్‌డ్యాంలు మంజూరు చేయించి సుమారు లక్ష ఎకరాలను సాగులోకి తెచ్చారని కొనియాడారు. మూడోసారి 50 వేల మెజార్టీతో ఆయనను గెలిపించాలని కోరారు.



అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

జంగ్ తెలంగాణ

పేటలో పచ్చని పంటలు పండిస్తా..

నారాయణపేట, మక్తల్‌కు నీళ్లొచ్చే కాల్వ మంజూరు చేశామని, ఏడెనిమిది నెలల్లో పూర్తయి నీళ్లొస్తాయని సీఎం కేసీఆర్ అన్నారు. రాజేందర్‌రెడ్డి జాయమ్మ చెరువును మరిచినా తనకు గుర్తుందని, ఈ చెరువుకు నీళ్లు వచ్చేలా చూస్తామన్నారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న కానుకుర్తి దగ్గర రిజర్వాయర్ కట్టించి.. నారాయణపేట ప్రాంతంలో పచ్చటి పంటలు పండేలా చేస్తానన్నారు. ఎన్నికల తర్వాత రాజేందర్‌రెడ్డి కోరిన కోరికలు తీర్చి జీఓ ఇచ్చి పూర్తి చేసే బాధ్యత తనదే అన్నారు. రాజేందర్‌రెడ్డి నువ్వు హుషార్ చేసి ప్రజల మధ్య ఇరికిచ్చినవ్.. అయినా పర్లేదు వాటిని తీర్చుతానని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ముందుకు పోవాలంటే బీఆర్‌ఎస్ మాత్రమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కాంగ్రెస్, బీజేపీ నాయకుడెవైన జై తెలంగాణ అన్నారా.. పదవుల కోసం.. కాంట్రాక్టు కోసం పోటీ పడ్డారు. కానీ, జై తెలంగాణ అనలేదు. 24 గంటలు కరెంట్ ఉండాలంటే రాజేందర్‌రెడ్డిని గెలిపించాలి.. తెలంగాణ ఉద్యమంలో నారాయణపేటకు వచ్చాను. అప్పట్లో బొంబాయికి వలస వెళ్లే బస్సులు కనిపించేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. అల్లా దయతో రాష్ట్రం వచ్చింది. మరోసారి చెబుతున్నా తెలంగాణ గద్దల పాలు కావొద్దంటే.. రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ప్రపంచ దేశాల్లో విద్వత్ గద్వాలగా పేరు..

గద్వాల చరిత్ర చాలా గొప్పదని.. ప్రపంచ **దేశాల్లో విద్వత్** గద్వాలగా గుర్తింపు ఉందని **సీఎం కేసీఆర్** అన్నారు. తిరుపతి వేంకట కవు**లను సన్మానిం**చిన గొప్ప చరిత్ర గద్వాలది **అని.. అందుకే** దేశంలోని శక్తిపీఠాల్లో ఒకరైన **జోగుళాంబ త**ల్లి పేరిట జిల్లాను ఏర్పాటు **చేసుకున్నామ**న్నారు. ఒకవైపు కృష్ణా.. మరో**వైపు తుంగభ**ద్ర నదులతో అలరారుతున్న **ప్రాంతాన్ని ఆ**గం లేపిన పార్టీ ఏదో మీకు **తెలుసు అని**.. అందుకే ఓటేసేటప్పుడు **అభ్యర్థి గుణం**.. గణంతో పాటు అతని వెనకాల ఉన్న పార్టీ చరిత్రను కూడా చూసి.. ఓటేయాలని కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నిలబడ్డారని.. పదేళ్లలో మనం ఏం సాధించుకున్నామో.. ఎంత అభివృద్ధి చెందామో గుర్తించాలని హితవు పలికారు. కృష్ణమోహన్‌రెడ్డిని గతంలో కంటే ఈసారి మరో 10 వేల ఎక్కువ మెజార్టీతో గెలిపించి.. గద్వాలను గబ్బు పట్టించినోళ్లను తరమికొట్టాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం గద్వాలలో నిర్వహించి ఎన్నికల ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంత కృష్ణానది నీళ్లను అనంతపురం జిల్లాకు తరలించుకుపోతుంటే ఇక్కడి నాయకులు హారతులు పట్టిందెవరో మీకు తెలుసు అని పరోక్షంగా డీకే అరుణనుద్దేశించి ఘాటుగా విమర్శించారు. ఉమ్మడి పాలమూరుకు సంబంధించి గద్వాలలోనే వాల్మీకి బోయలు అత్యధికంగా ఉన్నారని, ఈ ప్రాంతంలోని బోయలను బీసీలుగా పెట్టి ఆంధ్రలో ఎస్టీలుగా పెట్టింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి అని, ఆయన కూడా కాంగ్రెస్ పార్టీనే అని ఆరోపించారు. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపితే ఎవరు అడ్డుకుంటున్నారో మీకు తెలుసు.. నడిగడ్డను ఎండబెట్టి.. ఆర్డీఎస్ కాల్వను ఆగం పట్టించి.. ఆయకట్టుకు నీరు పారకుండా తీరని అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీనే అని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితులు అన్నీ మారిపోయాయని.. సాగునీటి ప్రాజెక్టులతో గద్వాల ప్రాంతం పచ్చబడిందన్నారు. ఇప్పటికే నర్సింగ్ కళాశాల వచ్చిందని, 300 పడకల జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాల సైతం సాధించుకోవడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ విధంగా అభివృద్ధి చేసిందో మీకు తెలుసని.. కష్టపడి గద్వాల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన కృష్ణమోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కేసీఆర్ కోరారు.

పంటల సాగులో మక్తల్ నంబర్‌వన్

అసంపూర్తిగా ఉన్న భీమా ఎత్తిపోతలు, సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లను పూర్తి చేసి సాగునీరు అందించడం వల్ల పంటల సాగులో మక్తల్ నంబర్‌వన్‌గా నిలిచిందని.. ఈ ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణలో మూడోసారి ఎన్నికలు జరగబోతున్నాయని, ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీలో నిలబడతారని, కానీ, ఎవరైతే బాగుంటుందో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. వాల్మీకీలను ముంచింది కాంగ్రెస్ పార్టీనే అని, రాష్ట్రంలో మొదట కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటమే వాల్మీకులకు శాపమైందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెడలు వంచి వాల్మీకుల సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. మక్తల్ ఎమ్మెల్యే మాట కటువుగా ఉన్నా.. మనసు మాత్రం గొప్పగా ఉంటుందన్నారు. మక్తల్‌కు 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని మంజూరు చేశామని, ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల్లోనే ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దివంగత చిట్టెం నర్సిరెడ్డి వారసుడిగా వచ్చి మక్తల్‌కు సేవ చేస్తున్నారని.. నియోజకవర్గ ప్రజలు ఈసారి కూడా కారు గుర్తుకు ఓటేసి రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



మహబూబ్‌నగర్‌లో కేసీఆర్ బస్సుపై పూలు చల్లుతున్న ప్రజలు

పాలమూరులో స్వాగతం..

ప్రజాఆశీర్వాద సభలు ముగిసిన తర్వాత సీఎం కేసీఆర్ రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో వన్‌టౌన్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పూలు చల్లి స్వాగతం పలికారు. గద్వాలలో జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రాములు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మందా జగన్నాథం, నాయకులు బొంతు రామోహ్మన్, రాకేష్, గట్టు తిమ్మప్ప, బీఎస్ కేశవ్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జంబు రామన్ గౌడ్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్ర వేదికపై నృత్యం చేస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు



గద్వాల సభకు హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

న్యూస్‌రీల్

బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

అలంపూర్/ శాంతినగర్: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం శాంతినగర్‌లో పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభ ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తెలియజేశారు. రేవంత్ రెడ్డి ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి అలంపూర్‌కు చేరుకుంటారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు హెలీప్యాడ్ నుంచి నేరుగా బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేస్తారని చెప్పారు. అనంతరం శాంతినగర్‌లో జరిగే ప్రజాగర్జన బహిరంగ సభకు వెళ్తారన్నారు. అనంతరం అక్కడి నుంచి బయల్దేరి గద్వాలలో బహిరంగ సభకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. శాంతినగర్‌లోని శివశివాని హైస్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

వేరుశనగ క్వింటా రూ.7,620

గద్వాల వ్యవసాయం: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 979 క్వింటాళ్ల వేరుశనగ రాగా.. గరిష్ఠంగా రూ.7,620, కనిష్ఠంగా రూ.2,640, సరాసరిగా రూ.5,700 ధరలు పలికాయి. అలాగే 214 క్వింటాళ్ల ఆముదం రాగా.. గరిష్ఠంగా రూ.5,360, కనిష్ఠంగా రూ.3,527, సరాసరిగా రూ.5,260 ధరలు వచ్చాయి. 269 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్ఠంగా రూ.2,321, కనిష్ఠంగా రూ.2,019, సరాసరి రూ.2,129 ధర పలికింది.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



మల్దకల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అధ్యాపకులు మెరుగైన విద్యాబోధన చేసి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు సూచించారు. సోమవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులు, కళాశాలకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలన్నారు. అధ్యాపకులు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రమేష్‌లింగం, రామాంజనేయులు గౌడ్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఊపందుకున్న నామినేషన్లు

- ఉమ్మడి జిల్లాలో మూడోరోజు 11 దాఖలు
- నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలో మూడేసి, అచ్చంపేట, కొల్లాపూర్, జడ్చర్ల, దేవరకద్రలో ఒకటి చొప్పున అందజేత

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)/ నాగర్‌కర్నూల్/ దేవరకద్ర/ జడ్చర్ల/ కల్వకుర్తి/ కొల్లాపూర్/ అచ్చంపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలో 11 నామినేషన్లు వచ్చాయి. మహబూబ్‌నగర్, జడ్చర్ల, కొల్లాపూర్, అచ్చంపేటలో ఒక్కొక్కటి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలో మూడు చొప్పున నామినేషన్లు దాఖలవగా.. ఇక్కడ ఒక అభ్యర్థి రెండు సెట్లు అందజేశారు.

- మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా అంతటి హరిప్రసాద్‌గౌడ్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి అనిల్‌కుమార్‌కు అందజేశారు.
- జడ్చర్ల అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా సాదాసీదాగా ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ మోహన్‌రావుకు అందజేశారు.
- దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గ నుంచి సోమవారం మొదటి నామినేషన్ దాఖలైంది. బీఎస్పీ అభ్యర్థిగా సంతోష్‌కుమార్‌రెడ్డి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి నటరాజ్‌కు అందజేశారు.
- నాగర్‌కర్నూల్ అసెంబ్లీ స్థానానికి గాను సోమవారం ఒకేరోజు నాలుగు నామినేషన్లు వచ్చాయి. ప్రజా ఏక్తా పార్టీ తరఫున బాచిపూర్ వెంకటయ్య (రెండు సెట్లు), విద్యార్థి రాజకీయ పార్టీ నుంచి సి.సురేందర్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా వడ్డె శివకృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు.
- కొల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు తరఫున నామినేషన్ పత్రాలను ఏఐసీసీ ఓబీసీ సెల్ జాతీయ కోఆర్డినేటర్ కేతూరి వెంకటేష్ రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్‌కు అందజేశారు.
- అచ్చంపేట నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థి మొత్కూరి నాగార్జున నామినేషన్ దాఖలు చేశారు. కాగా.. అసెంబ్లీ బరిలో ఇదే మొదటి నామినేషన్ కావడం విశేషం.
- కల్వకుర్తి అసెంబ్లీ స్థానానికి సోమవారం నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి శ్రీను తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఆమనగల్ ఎంపీపీ అనిత, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితో కలిసి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే మాడ్గుల మండలం చంద్రమన్‌పల్లికి చెందిన హనుమదాస్, అచ్చంపేట మండలం లింగోటంకు చెందిన ఆంజనేయులు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.
- కాగా నారాయణపేట, వనపర్తి, అలంపూర్, గద్వాల, వనపర్తి అసెంబ్లీ స్థానాల నుంచి సోమవారం ఎవరూ నామినేషన్లు దాఖలు చేయలేదని సంబంధిత రిటర్నింగ్ అధికారులు తెలిపారు.



కల్వకుర్తిలో నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నారాయణరెడ్డి

మంచిరోజుల కోసం..

తమ భవితవ్యాన్ని నిర్దేశించే ఎన్నికలు కావడంతో అభ్యర్థులు నామినేషన్ దాఖలుకు మంచి ముహూర్తాల కోసం చూస్తున్నారు. అర్చకులు, పురోహితులు, జోతిష్యశాస్త్ర నిపుణులను సంప్రదిస్తున్నారు. అయితే చివరి మూడు రోజులు శుభ ముహూర్తాలు ఉన్నాయని ఆ రోజుల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

మూడో రోజు నిల్

అలంపూర్/ గద్వాల రూరల్: నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. నామినేషన్ల మూడో రోజు సోమవారం గద్వాల నియోజకవర్గం, అలంపూర్ నియోజకవర్గం అసెంబ్లీ స్థానాలకు ఎలాంటి నామినేషన్లు రాలేదని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వల్లూరి క్రాంతి తెలియజేశారు. అలంపూర్‌లో నామినేషన్ల తొలి రోజు ప్రేమలత స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల రెండో రోజు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున రెండో నామినేషన్ దాఖలు చేశారు. అయితే నామినేషన్ పత్రాలతో పాటు బీఫాం మాత్రం ఇవ్వలేదు. ఇలా నామినేషన్ల పర్వం ఆరంభమై మూడు రోజుల్లో ఒక అభ్యర్థికి చెందిన రెండు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 10వ తేదీ వరకు సమయం ఉంది. దీంతో అభ్యర్థులు మంచి రోజుల కోసం వేచి చూస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా నామినేషన్ స్వీకరణ కేంద్రం వద్ద 100 మీటర్ల పరిధి వరకు ఇతరులను లోపలికి అనుమతించడం లేదు. మంగళవారం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. సమయం దగ్గర పడుతుండటంతో నామినేషన్ల పర్వం జోరందుకునే అవకాశం ఉంది.

వనపర్తి కాంగ్రెస్ అభ్యర్థి మార్పు

- చిన్నారెడ్డిని మారుస్తూ అధిష్ఠానం నిర్ణయం
- మేఘారెడ్డికి దక్కిన టికెట్

వనపర్తి: కాంగ్రెస్ అధిష్ఠానం సంచలన నిర్ణయం తీసుకుంది. రెండోజాబితాలో వనపర్తి టికెట్ దక్కించుకున్న ఏఐసీసీ కార్యదర్శి, మాజీమంత్రి జి.చిన్నారెడ్డిని పక్కన పెట్టింది. సర్వేల్లో ముందంజలో ఉన్న మేఘారెడ్డికి వనపర్తి కాంగ్రెస్ టికెట్ ఖరారు చేస్తూ.. సోమవారం రాత్రి మూడో జాబితా విడుదల చేసింది. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన పెద్దమందడి ఎంపీపీకి టికెట్ ఖరారు చేసి నియోజకవర్గ కాంగ్రెస్‌లో ఉత్సాహాన్ని నింపింది.

మేఘారెడ్డి ప్రొఫైల్...

పేరు: తూడి మేఘారెడ్డి
తల్లిదండ్రులు: వెంకటమ్మ, సాయిరెడ్డి
పుట్టిన తేదీ : 06/10/1972
భార్య : తూడి శారద, సర్పంచ్ మంగంపల్లి, పెద్దమందడి మండలం
సంతానం : ఇద్దరు కుమారులు
విద్యార్హత: డిగ్రీ (బీఎస్సీ)



రాజకీయ ప్రస్థానం..

2003 సంవత్సరంలో టీడీపీలో రాజకీయ అరంగేట్రం చేశారు. 2015లో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన ఆరేళ్ల పాటు పెద్దమందడి మండలం పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2019 నుంచి పెద్దమందడి ఎంపీపీగా కొనసాగుతున్నారు. 2023 మార్చిలో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం

- కలెక్టర్ వల్లూరి క్రాంతి

గద్వాల రూరల్ /ఎర్రవల్లిచౌరస్తా: అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ కళాశాలలో పీఓ, ఏపీఓ, ఓపీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల బూత్‌లో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా.. శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన మార్గదర్శకాలను స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. ఈవీఎం విధానంపై పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 6 నుంచి మాక్ పోల్ నిర్వహించి క్లోజ్ రిజల్ట్ బటన్ అయ్యేదాకా పరిశీలించి, తదుపరి పోలింగ్ ప్రారంభించాలన్నారు. ప్రతిఒక్కరూ ఫారం 12 నమోదు చేసి ఇవ్వాలని సూచించారు.

నిబంధనలు స్పష్టంగా తెలుసుకోవాలి..

ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు ఎన్నికల నిబంధనలు స్పష్టంగా తెలుసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో అలంపూర్ నియోజకవర్గంలో ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులకు అందిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఈవీఎం యంత్రాల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. శిక్షణ పొందిన ఓపీఓలు పోలింగ్ బూత్‌లతో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని సూచించారు. శిక్షణ తరగతులను అర్థం చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జాగ్రత్తగా విధులు నిర్వహిస్తే ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండదన్నారు. ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ ఉదయం ఆరు గంటలకు చేపట్టాలన్నారు.

గెస్ట్‌లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

శాంతినగర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాంతినగర్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి తెలుగు–1 బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండి పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగి బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో ఉదయం 11 గంటలకు ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గద్వాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేటలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. ఆయా పట్టణాలన్నీ గులాబీ మయంగా మారాయి. సీఎం కేసీఆర్ రాక కొంత ఆలస్యం కాగా.. పార్టీ శ్రేణులు, **ప్రజలు నిరుత్సాహానికి గురికాకుండా కళాకారులు ఆటాపాటలతో హోరెత్తించారు. దేవరకద్ర సభలో కళాకారులతో పాటు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు స్టెప్పులేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.** – సాక్షి నెట్‌వర్క్



దేవరకద్రలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, వేదికపై ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు నాగం జనార్దన్‌రెడ్డి, పి.చంద్రశేఖర్

గులాబీ జోరు

గద్వాల సభలో..

- గద్వాల ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గంలోని కార్యకర్తలు, రైతులు, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు.
- **బీఆర్‌ఎస్ శ్రేణులు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు.**
- **పట్టణం మొత్తం గులాబీమయంగా** మారింది.
- సభలో కళాకారులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు.
- సీఎం రాక ఆలస్యం కావడంతో చాలామంది నిరుత్సాహానికి గురయ్యారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సభాస్థలి నుంచి వెనుదిరిగిపోవడం కనిపించింది.
- సాయంత్రం 4:32 గంటలకు సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ గద్వాలకు చేరుకుంది.
- హెలిక్యాప్టర్ రాకను గమనించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు.
- **హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికారు. అనంతరం సభావేదిక నుంచి సీఎం కేసీఆర్ ప్రజలకు** అభివాదం చేశారు.
- సీఎం కేసీఆర్ 4:47గంటలకు ప్రసంగం మొదలుపెట్టి 15నిమిషాల పాటు కొనసాగించారు.
- కేసీఆర్ తనదైన శైలిలో ప్రసంగిస్తూ మధ్య మధ్యలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో పాటు స్థానిక ప్రతిపక్ష నాయకులపై విమర్శనాస్త్రాలు సంధించారు.

నారాయణపేటలో..

- **సింగారం గేటు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు సాయంత్రం 5:40 గంటలకు సీఎం కేసీఆర్ చేరుకున్నారు.**
- **ప్రత్యేక వాహనంలో 6గంటలకు సభాస్థలికి చేరుకుని ప్రజలకు** అభివాదం చేశారు.
- 6:10గంటల నుంచి అరగంట పాటు ప్రసంగించారు.
- 6:45 గంటలకు ప్రత్యేక వాహనంలో బయల్దేరి వెళ్లారు.
- మధ్యాహ్నం 2గంటల నుంచి సభ ముగిసే వరకు జనం ఓపికతో ఉండిపోయారు.


విజిల్ వేస్తున్న మహిళ


మధుప్రియ ఆటాపాట


దేవరకద్రలో సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న నాగం జనార్దన్‌రెడ్డి


గద్వాలలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మక్తల్‌లో కేసీఆర్ ప్రసంగం 8నిమిషాలే..

మక్తల్ పట్టణంలో కేసీఆర్ సభ వేదిక వద్దకు 5:10 గంటలకు హెలిప్యాడు నుంచి చేరుకుని ఐదు నిమిషాలు వేదికపై ఉన్నవారితో మాట్లాడారు. వెంటనే సభలో 5:20 గంటలకు ప్రసంగం పూర్తి చేశారు. అనంతరం 5:25కు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 5:30కు నారాయణపేటకు బయలు దేరారు. సభకు పలు గ్రామాల నుంచి తరలివచ్చి కేసీఆర్ ఏం చెబుతారో ఎదురుచూస్తున్న ప్రజలు మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేచి ఉన్నారు. వచ్చినా 8 నిమిషాలే మాట్లాడటంతో చాలా నిరాశ చెందారు.

దేవరకద్ర సభ సైడ్‌లైట్స్..

- దేవరకద్ర ప్రజా ఆశీర్వాద సభకు ఉదయం 11 గంటలకే పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలి వచ్చారు. సభ ప్రాంగణమంతా జనంతో కిక్కిరిసిపోయింది.
- మధ్యాహ్నం 1:30 గంటలకు సీఎం వస్తారని షెడ్యూల్‌లో ఉండగా.. హెలిక్యాప్టర్‌లో **సాంకేతిక సమస్య వల్ల సీఎం రాక ఆలస్యమైంది.**
- **మధుప్రియ బృందం ఆటపాటలతో ఉర్రూతలూగించింది.**
- **మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గులాబీ కండువాలు ఊపుతూ నృత్యం చేయడంతో సభ కేకలతో దద్దరిల్లిపోయింది.**
- **ఎమ్మెల్యే ఆల సతీమణి మంజుల మహిళల గ్యాలరీలో కుర్చున్నారు.**
- **సీఎం రాకకు ముందే మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల ప్రసంగాలను ముగించారు.**
- **3:35 గంటలకు సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ దేవరకద్రలో చక్కర్లు కొట్టింది.**
- **3:38 గంటలకు హెలిక్యాప్టర్ ల్యాండ్ అయింది.**
- **3:45 గంటలకు ప్రత్యేక బస్సులో సీఎంతో పాటు ముఖ్యనాయకులు సభా ప్రాంగణానికి** చేరుకున్నారు.
- 3:50గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించి.. 4:02 నిముషాలకు ముగించారు.
- 4:08 గంటలకు కాంగ్రెస్ నాయకులు సీఎం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.
- 4:15 గంటలకు కేసీఆర్ గద్వాలకు బయల్దేరారు.

ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యం



పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో నారాయణపేట నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరందించి రైతుల పాదాలు కడగడమే తన జీవిత ఆశయమని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పలు అంశాలను సీఎం కేసీఆర్ ముందుంచారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం నారాయణపేట జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. జిల్లా అభివృద్ధికి అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నరని.. నారాయణపేట, దామరగిద్ద, కోయిలకొండ మండలాల్లో కొత్తగా మూడు మండల కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని సీఎంను కోరారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ డిగ్రీ కళాశాలగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ కళాభవన్ ఏర్పాటు చేయాలని, ముదిరాజ్ భవనానికి రూ.2కోట్లు ఇవ్వాలని, కళాశాల విద్యార్థినుల వసతిగృహం ఏర్పాటుకు రూ.10కోట్లు మంజూరు చేయాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలని, నారాయణపేట నగరం చుట్టూ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాలని విన్నవించారు. తనను మరోసారి గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తనను గెలిపించిన ఏడాదిలోపు కరివెన నుంచి సాగునీరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

రాష్ట్రానికి వస్తున్న దొంగలను తరిమేస్తాం..



రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసేందుకు వస్తున్న దొంగలను తరిమే వరకు విశ్రమించేదిలేదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 11 సార్లు అధికారం ఇస్తే కాంగ్రెస్ రాష్ట్రాన్ని కుక్కలు చింపిన ఇస్తరిలా చేస్తుందన్నారు. మూడేళ్లుగా వర్షాలు లేకున్నా వాగులు వస్తున్నాయంటే కేసీఆర్ పనితీరుకు నిదర్శమని, చెక్‌డ్యాంల నిర్మాణాలతో భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ఒక చెక్‌డ్యాం కట్టకుండా రైతులను ముప్పుతిప్పలు పెట్టినోళ్లు నేడు మాయమాటలతో వస్తున్నారని విమర్శించారు. నిరక్షరాస్యత, వలసలతో ఇబ్బందులు పడిన పాలమూరు నేడు అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. 2012లో నాటేయడానికి వెళితే రూ.20లు ఇచ్చారని, నేడు రూ.వేలు వస్తున్నాయని కూలీలు స్వయంగా చెబుతుంటే సంతోషంగా ఉందన్నారు. దొంగ సర్వేలతో ఒక్కొక్కరు ఒక్కో ముఖ్యమంత్రి అంటూ ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. టికెట్లు ఇవ్వడానికే దిక్కులేని పార్టీ, మేము విడిచిపెడితే వారిని తీసుకుని టికెట్లిచ్చారని ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో కూర్చొని టికెట్లిచ్చే దమ్ముందా అంటూ సవాల్ విసిరారు. కర్ణాటకలో మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. మూడు గంటల కరెంట్ సరిపోతుందని రైతులపై కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఒకరిమీది కోపంతో ఇతరులకు ఓట్లేస్తే నష్టపోతామని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తేలేదన్నారు.

వ్యవసాయం మూడింతలు పెరిగింది



ప్రత్యేక రాష్ట్రం వచ్చాక దేవరకద్ర నియోజకవర్గంలో గతానికి మూడింతల వ్యవసాయం పెరిగిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా వాగులపై 30 చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిచ్చిందని, అందులో ఇప్పటి వరకు 22 పూర్తి చేసుకున్నామన్నారు. దీంతో భూగర్భ జలాల సామర్థ్యం గణనీయంగా పెరిగిందన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగమైన కరివెన ప్రాజెక్టు 95 శాతం పూర్తయ్యిందని, కాల్వల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కరివెన ద్వారా 1.8 లక్షల ఎకరాలు సాగులోకి రానుందని, అందులో 60వేల ఎకరాలు దేవరకద్ర నియోజకవర్గంలోనే ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కేసీఆర్‌కు అడుగడునా అడ్డంకులు పెడుతూ ఇబ్బందులు పెడుతుందన్నారు. ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే యువతకు ఉపాధి కల్పన కోసం పరిశ్రమల ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. కొత్తకోటకు డిగ్రీ కళాశాల, దేవరకద్రకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని తెలిపారు. పేదల తిరుపతిగా భావించే కురుమూర్తి దేవస్థానానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


సత్తెయ్య (ఫైల్)

ఉప్పునుంతల: వ్యవసాయ పొలంలో మోటారు స్టార్టర్ వద్ద తీగలను సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌తో పులిజ్కరం సత్తెయ్య (37) రైతు అక్కడిక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని వెల్టూర్‌లో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం .. సత్తెయ్య తన పొలంలో యాసంగి పంటగా వేరుశనగ విత్తనాలు వేయడానికి భార్య మోహినమ్మతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం మోటారు నడవడంలేదంటూ విద్యుత్ తీగలను సరిచేసే క్రమంలో షాక్‌కు గురయ్యాడు. మృతునికి భార్యతోపాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి..

అమరచింత: తండ్రి మందలించాడని కూతురు ఆత్మహత్యాయత్నంకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెంది. పట్టణానికి చెందిన శ్రీను కుతూరు అక్షయ(14) ఆత్మకూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. చదువు విషయంలో కుతూరికి హితవు చెప్పడానికి యత్నించడంతో ఆవేశంతో ఇంట్లో చున్నితో గొంతు నులుముకుంటూ ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. దీంతో స్పృహ లేకుండా ఉన్న కుతూరిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది.

'సాక్షి' స్పెల్–బీకి విశేష స్పందన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రానికి సమీపంలోని మౌంట్ బాసిల్ హైస్కూల్ (ఎంబీహెచ్‌ఎస్)లో సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్–బీ ప్రిలిమినరీ రౌండ్–1కి స్పందన వచ్చింది. కేటగిరీ 1, 2, 3, 4లలో కొనసాగిన ఈ పరీక్షలో సుమారు 50 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంబీహెచ్‌ఎస్ ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా తమ పాఠశాలలో స్పెల్–బీ నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇంగ్లిష్ భాషలో విద్యార్థులు రాణించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చంద్రకళా వెంకట్, పూజితా మోహన్‌రెడ్డి, కృష్ణ సుశాంత్, శిరీషా ప్రవీణ్, ఈవెంట్ కో–ఆర్డినేటర్ సాయిప్రణీత తదితరులు పాల్గొన్నారు.


'స్పెల్–బీ' పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎంబీహెచ్‌ఎస్ డైరెక్టర్ పూజితా మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి

118 పదాలు నేర్చుకున్నాను..



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వ హించిన స్పెల్–బీ (కేటగిరీ–1) ద్వారా 118 పదా లు నేర్చుకోగలిగాను. ఇంగ్లిష్‌లో వాక్యాలు, పదాలు ఎలా పలకాలో ఉపాధ్యాయులు చక్కగా నేర్పిస్తున్నారు. ముఖ్యంగా ఈ భాషలో ప్రొనౌన్సియేషన్‌పై దృష్టి పెట్టాను. ఇంటి వద్ద కూడా తల్లిదండ్రుల సాయంతో ప్రాక్టీస్ చేస్తున్నాను.
– సాహిత్య, ఒకటో తరగతి

మొదట్లో కొంత భయపడ్డాను..



మొదట్లో ఈ పరీక్ష ఎలా రాయాలోనని కొంత భయపడ్డాను. అయితే పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద అమ్మానాన్న ఎంతగానో ధైర్యం చెప్పారు. చివరకు ఈ స్పెల్–బీ (కేటగిరీ–2) ద్వారా ఇంగ్లిష్ భాషలో 175 పదాలు నేర్చుకున్నాను. దీంతో ఇలాంటి పరీక్షలు భవిష్యత్‌లోనూ రాయాలనిపిస్తోంది.
– మరియాజబీన్, నాలుగో తరగతి

సులభంగా మాట్లాడగలుగుతున్నాను



'సాక్షి' ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న స్పెల్–బీ (కేటగిరీ–4) పరీక్ష రాయడం ఇది రెండోసారి. దీని ద్వారా ఇంగ్లిష్ భాషలో సులభంగా మాట్లాడగలుగుతున్నాను. ప్రధానంగా ప్రొనౌన్సియేషన్ కరెక్ట్‌గా పలకడం నేర్చుకున్నాను. ఎంతో చాలెంజింగ్‌గా ఫీలవుతున్నాను. పాఠశాలలో ఉపాధ్యాయులు బాగా చదువు చెబుతున్నారు.
– విశిష్ట, ఎనిమిదో తరగతి

ఐఐటీకి ఎంతో ఉపయోగం



ఈ పరీక్ష రాయడం ఇదే మొదటిసారి. స్పెల్–బీ (కేటగిరీ–3) ద్వారా ఇంగ్లిష్ బాగా నేర్చుకోవడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. ఇప్పటి నుంచి ఐఐటీ కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నాను. వివిధ పోటీ పరీక్షలు రాయడానికి, ముఖ్యంగా ఈ భాషలో ఎన్నో మెళకువలు తెలుసుకోవడం సులభమైంది.
– రిత్విక్, ఏడో తరగతి

ఇంగ్లిష్‌లో పట్టు వస్తుంది



ఆయా కేటగిరీల్లో స్పెల్–బీ రాయడం వల్ల విద్యార్థులకు ఇంగ్లిష్ భాషలో పట్టు వస్తుంది. ఇప్పటికే ఈ పరీక్షకు సంబంధించి మా పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయికి వెళ్లొచ్చారు. వీరికి తల్లిదండ్రుల సహకారం బాగా ఉంది. భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు సాధించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.
– సురేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఎంబీహెచ్‌ఎస్

ఇథనాల్ కంపెనీ ఎత్తివేసే వరకు పోరాటం

- పోలీస్ లాఠీచార్జ్ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి


మాట్లాడుతున్న రాఘవాచారి

పాలమూరు: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ ఎత్తివేసే వరకు పోరాటం సాగిస్తామని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇప్టూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇథనాల్ కంపెనీ వ్యర్థాలను సమీపంలోని వాగులు, వ్యవసాయ భూముల్లో వేయడం వల్ల విపరీతమైన కాలుష్యం ఏర్పడిందన్నారు. ప్రజలు భయంతో అల్లాడిపోతున్నారని తెలిపారు. కంపెనీని మూసివేయాలని ఇటీవల శాంతియుతంగా ఆందోళన చేపట్టిన గ్రామస్తులపై పోలీసులు లాఠీచార్జ్ చేసిన ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే రాజకీయ అభ్యర్థులు ఇంథనాల్ కంపెనీ ఎత్తివేస్తారా లేదా అనేది ప్రజలకు చెప్పాలని, లేకపోతే ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. చిత్తనూర్ ఇంథనాల్ కంపెనీ సమస్యపై ఈనెల 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఖలీల్, కేసీ వెంకటేశ్వర్లు, జలాల్ పాషా ఉన్నారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 2,800క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్ కొనసాగుతుంది. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 99, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.462 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో నీటిమట్టం 842 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 842 అడుగుల వద్ద 64.9 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 25,427 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. గత 24 గంటల వ్యవధిలో మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,392, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 960, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 135 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

నా గెలుపు బాధ్యత మీదే

- రెండేళ్లలో రాష్ట్రం దశ, దిశ మారుతుంది
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేత


ప్రజలకు అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి

కొడంగల్: నా గెలుపు బాధ్యత మీదే.. ఈ ఎన్నికల్లో కొడంగల్ సత్తా ఏంటో చూపించండి అని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ తరపున కొడంగల్‌లో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కేటీఆర్ దత్తత పేరుతో కొడంగల్‌కు మోసం చేశారని, కృష్ణా రైల్వే లైన్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో జూనియర్ కళాశాలలు, కృష్ణా జలాలు తెచ్చి ఇక్కడి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ సన్నాసులు ఇవాళ ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఈ ఎన్నికలు ఆషామాషీ ఎన్నికలు కావని, ఇక్కడి ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చే ఎన్నికలన్నారు. దేశ ముఖ చిత్రంలో కొడంగల్‌కు గుర్తింపు తెచ్చే ఎన్నికలన్నారు. గెలిచిన రెండేళ్లలో నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పూర్తి చేసి నీళ్లు తెస్తానని హామీ ఇచ్చారు. ఏడాదిలో మహబూబ్‌నగర్ నుంచి చించోళి జాతీయ రహదారి పూర్తి చేస్తానని, ఆడ బిడ్డలకు ప్రత్యేక డిగ్రీ కళాశాలలను తెస్తానని, అండగా నిలబడే ప్రజల ఆత్మ గౌరవం నిలబెట్టే బాధ్యత తనదేనని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

- రేవంత్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా సోమవారం కొడంగల్ పట్టణం జనసంద్రంగా మారింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఆలయాల్లో పూజలు చేసి ర్యాలీగా కొడంగల్‌కు చేరుకున్నారు. రావులపల్లి సర్పంచ్ రమేష్‌రెడ్డి దేశ్‌ముఖ్ శివలింగానికి, ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్సాపూర్‌లో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా కొడంగల్‌కు చేరుకున్నారు. రేవంత్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా గాడిబాయి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నామినేషన్ వేయడానికి బయలుదేరారు. వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావడంతో కొడంగల్ జన సంద్రంగా మారింది.

మామను హత్యచేసిన అల్లుడు

మక్తల్: బిడ్డను ఇచ్చిన మామను అల్లుడే హత్య చేసిన ఘటన మక్తల్ మండలం చందాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చందాపూర్‌కు చెందిన సిరిపే రాములు (53)కు తన అల్లుడు చందుతో భేదాభిప్రాయలు వచ్చాయి. సిరిపే రాములుకు మగపిల్లలు లేకపోవడంతో అల్లుడు చందును తన కూతురికి ఇల్లరికం తీసుకొచ్చాడు. వారికి పిల్లలు ఉన్నారు. ఇటీవల చందు భార్య అనారోగ్యంతో మృతి చెందింది. ఇంట్లో ఇబ్బందులు ఏర్పడ్డాయి. చందు మరో పెళ్లి చేసుకుందామనుకున్నాడు. అందుకు మామ సిరిపే రాములు సహకరించడం లేదని, ఏపని చేసినా విభేదాలు చేసేవాడని ఇద్దరి మధ్యం ఘర్షణ పెరిగింది. మాటిమాటికి ఇంట్లో ఘర్షణ వాతావరణం మొదలవుతుండేది. ఎలాగైన మామను హత్య చేయాలని చందు పథకం వేసుకున్నాడు. ఆదివారం రాత్రి పొలానికి కాపల కాసేందుకు టీవీఎస్ చాంప్‌పై వెళ్తున్న సమయంలో దారిలో కాపు కాసి కట్టెలతో మామపై దాడి చేశాడు. ఈ దాడిలో మామ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా ఉండేందుకు మామ మృతదేహాన్ని పొలం దగ్గర వదిలేశాడు. సోమవారం తన మామను ఎవరో హత్య చేశారని, మొసలి కన్నీరు కార్చాడు. అల్లుడు చందుపై అనుమానం ఉందని సిరిపే రాములు సోదరుడు లింగప్ప మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తామని ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్లు (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా


నజ్ముల్ · షకీబ్



అసలంక

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికే అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × అఫ్గానిస్తాన్

వేదిక: ముంబై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా


రవితేజ

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.


అనుష్క

అనుష్క @ 50

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.


కమల్ హాసన్

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ– ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.


● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.


గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్



''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ–''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.